ఆమె ప్రేమకు
సమాధికడితే
మంచుపర్వతమైన అతడి
మనసుకథ?

# మరపురానిబాధకన్నా

పొత్తూరి
పద్మిని
కథ

ఆఫీసునుండి రాగానే కాఫీ చేతికిస్తూ ఆనందంగా శ్రీమతి చెపుతుంటే నా బుర్రకి ఒక్క మాటకూడా ఎక్కడంలేదు. కేవలం అన్నయ్య పెళ్లి అమరావతిలోట' అన్న ఒక్క మాట నా చెవులకి వినబడింది! 'అన్నయ్య... వదిన ఫోటో పంపాడు చూడండి... పెద్ద పెద్ద కళ్లు ఎంత అందంగా వుందో!'' ఆనందంగా, తన్మయత్వంగా చెప్పుతున్న జ్యోతివైపు రెప్ప వేయకుండా చూశాను.

నానుండి ఎటువంటి సమాధానం రాక పోయేసరికి నా భుజాలు పట్టుకుని ఊపేసింది.

''ఏమిటండీ... అలా వున్నారు!''

''మనం ముందు విజయవాడ అమ్మా వాళ్లింటికి వెళ్లి, పెళ్లికి వాళ్లతో కలిసి వెళదాం! నాన్న బస్సు మాట్లాడారుట! మనిద్దరినీ వారం రోజులముందు రమ్మని వ్రాశారు...''

''అమరావతి!''


''అమరావతి...''

ఎదలోతుల్లో ఏదో తెలియని స్పందన! ఏదో తెలియని ఉలిక్కిపాటు!

గతం తాలూకు నీడలు ఒక్కసారిగా ముసిరాయి! కనిపించీ కనిపించని ఓ చిలిపి రూపం, మెరిసీ మెరవకుండా మాయమయింది! చెళ్లున చెంపమీద ఒకటి కొట్టినట్టు అయింది.

బావమరది పెళ్లికి వెళ్లక తప్పదు! ముందు జ్యోతిని పంపి పెళ్లి వేళకి నేను వెళదాం అనుకున్నాను!

రాత్రి తెల్లవార్లూ నిద్ర లేదు! ఏదో



తెలియని బాధ! గుండెల్ని పిండేస్తుంటే నిద్ర ఎలా పడుతుంది. పరోక్షంగా నేను చేసిన పాపానికి శిక్ష అనుభవించి తీరాల్సిందే. కానీ ఎప్పుడో! ఎక్కడో! నిన్నటి రోజు మళ్లీ రానట్లే గతంకూడా గుర్తుకు రాకుంటే మనిషి మనుగడే వేరుగా వుంటుంది!

మరపురాని బాధకన్నా మధురమే లేదూ!

ఆ కవి అన్న మాటలు ఎంత సత్యాలు!

కానీ మరపురాని బాధకన్నా శిక్ష మరోటి లేదు!

◇ ◆ ◇

"ఏమిటండీ... మీ మంచం దగ్గర అన్ని సిగరెట్ పీకలు... రాత్రి జాగారం చేశారా? మందలింపుగా అంటున్న జ్యోతికి ఏం తెలుసు నా ఆవేదన!

"జ్యోతి... పెళ్లికి నేను రాక తప్పదా?"

"అప్పులు ఏమిటండీ... మీ ఉద్దేశ్యం... ఒక్కగాను ఒక్క అల్లుడు... కొడుకు పెళ్లికి రాకపోతే... ఆ ముసలి ప్రాణాలు ఎంత బాధపడతాయి! నలుగురూ ఏం అనుకుంటారూ! ఒక్కసారి ఆలోచించండి!"

నేను ఏం మాట్లాడలేదు! జ్యోతి ఉత్సాహంగా బట్టలు సర్దుతుంటే నా గుండెల్లో ఎవరో గునపాలతో పొడుస్తున్నట్లుగా వుంది! కాళ్లూ చేతులూ నా వశం తప్పి వణకడం ప్రారంభించాయి!"

"రామూ... రామూ!" ఎవరో ఎక్కడో దూరంనుంచి నన్ను పిలుస్తున్నట్లు ఆలాపన!

ఇంకెవరూ... ఆమె... ముచ్చెమటలు పట్టిన నా నుదుటిని రుమాలుతో అద్దుకున్నాను!

"అబ్బ ఏమిటే సామాను... ఒక్క సూట్‌కేసు అయితే చాలదా?" చిరాకు పడ్డాను.

"అబ్బబ్బ... అన్నయ్య పెళ్లి అనుకున్నప్పటినుండి ఒకటే చిరాకు పడిపోతున్నారు. కారణం ఏమిటో... అర్థం కావడంలేదు అప్పులు మీ పద్ధతి..."

"అబ్బే... ఏం లేదు..."

"ఏం లేకపోవడం ఏమిటి? ఒక్కటే పరధ్యానం... ఆలోచన... నేను గమనించడంలేదనుకున్నారా?" సీరియస్‌గా అంటున్న జ్యోతికి ఏం సమాధానం చెప్పకుండా సిగరెట్ వెలిగించాను.

"మధ్యలో... ఈ దరిద్రపు అలవాటు..." విసుక్కుంది.

◇ ◆ ◇

ఆటో దిగుతూనే మామయ్యగారు, బావమరిది పరుగున వచ్చారు.

"నన్ను చూస్తూనే "అదేమిటి... అలా చిక్కిపోయారు. వంట్లో బాగుండడంలేదా?—" అదుర్దాగా అడిగారు మామయ్యగారు.

మాసిన గెడ్డం, లోతుకు పోయిన కళ్లు... నిజమే నా రూపం నాకే ఆశ్చర్యంగా వుంది! శారీరక బాధకంటే మానసిక బాధ మనిషిని బాగా కృంగదీస్తుంది. అదే నిజమైంది నా జీవితంలో! నా జీవితంలో మళ్లీ గత జీవితంలోకి తొంగిచూస్తానని, ఇలా బాధపడాల్సి వస్తుందని నేను అనుకోలేదు! గతం ఎప్పుడూ... గతం కాదు! అది ఎప్పుడు జీవించే వుంటుంది! అని నాకనిపించింది.

ప్రయాణ బడలికతో ఒక్క కునుకు పట్టింది! జ్యోతి నన్ను కుదిపేస్తోంది!

"అబ్బబ్బ... అన్నయ్యకి కాబోయే బావమరిది వచ్చాడు. ఆ మాసిన గడ్డం చూడలేకుండా వున్నాను. కాస్త షేవ్ చేసుకుని రండి బాబూ" కాఫీ గ్లాసు చేతికిచ్చి బతిమిలాడుతున్నట్టు అంది.

◇ ◆ ◇

పెళ్లి ఇంకా రెండు రోజులు వుండగా

చుట్టాలు ఒక్కొక్కళ్లే దిగుతున్నారు. ఇల్లంతా సందడిగా వుంది! అరుపులూ, నవ్వులూ వంటి పిల్లల ఏడుపులతో కోలాహలంగా వుంది!

నేను మాత్రం గది వదిలి రాలేదు! రావాలని సరదాగా గడపాలనీ అనిపించడంలేదు. రాత్రికి పెళ్లిముహూర్తం అనగా ప్రొద్దున్నే ఆరు గంటలకి బయలుదేరింది బస్సు! జ్యోతి ఆడపడుచుకదా! చాలా హడావిడి చేసేస్తోంది!

ఎనిమిదిన్నరకల్లా అమరావతిలో పెళ్లివారింటి ముందు ఆగింది. ఒక్కసారి చుట్టూ కలియజూశాను. ఎంతో మారిపోయి వుంటు అందనుకున్నామా! కానీ పెద్ద మార్పులేం లేవు!

పెళ్లివారు లోపలికి ఆహ్వానించారు. విడిదిల్లు చూపించారు!

పదేళ్ల క్రితం మేం అద్దెకి ఉన్న ఇల్లే అది! బాగా పాతబడిపోయింది! ఇంటి ఓనర్ శాస్త్రిగారు పోయారట. నాలగేళ్ల క్రిందట! కొడుకు హైదరాబాద్ చేరాడట! నా కళ్లు ఎదురింటిమీద వాలాయి!

"రాముా... నువ్వు బ్యాంకు మేనేజర్ గారి అబ్బాయివికదూ! మీ నాన్నగారు చంద్రశేఖర్ గారు..." ఎవరో గుర్తుపట్టి అడిగారు!

"ఆ... అవునండి..."

"ఎంత మారిపోయావయ్యా..."

"నాన్నగారు... బాగున్నారా?"

"నాన్న పోయి.. ఏడాది దాటింది..."

"అయ్యో...!"

"శర్మగారూ... ఈ ఇల్లు..."

"ఆ... నేనే కొనుక్కున్నానయ్యా... గీత పోయాక ఆ బెంగలో మాణిక్యమ్మగారు మంచం పట్టి ఆరు నెలలకే పోయారు! కనకారావు మద్రాసులో ఉద్యోగం వస్తే ఈ ఇల్లు అమ్మేసి వెళ్లిపోయాడు. నేను కొనుక్కున్నాను పాతిక వేలకి!

## వింతవిషయాలు



"అమెరికా అడవులలోని జకానా రెండడుగుల జంతువు సెకండుకు నాలుగు కిలోమీటర్ల వేగంతో పరుగెడుతుంది. అంటే గంటకు 14,400 కిలోమీటర్ల వేగం. మాస్కో నగరంలోని ఒక రోడ్డు పేరు 'హెవెన్' అట. ఈ రోడ్డులో యాక్సిడెంట్లు ఎక్కువట. అందుకని ఆ పేరు పెట్టారుట.

అరిజ్యాక్వైయిర్ నది ఇసుకపైన ఎవరైనా అడుగు మోపగానే పిల్లనగ్రోవి వినిపిస్తుంది. ప్రతిరోజూ చాలామంది ఈ ఇసుకపై అడుగువేసి రమ్యమైన సంగీతం వినిపోతుంటారు.

—శ్రీశారద

"గీత చనిపోయాక మాణిక్యమ్మగారు కూడా మంచాన పడి చనిపోయారా?"

దంపంతో గుండెని ముక్కలు ముక్కలుగా కోసినట్లు అయింది! అక్కడ ఉన్న కుర్చీలో చతికిలపడిపోయాను!

"ఏమండీ... మీరు కాలేజీ చదివే రోజుల్లో మీ డాడీకి ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయిందటగా... ఈ ఊరులో చాలామంది తెలిసినవాళ్ళు వుంటారు. అలా సరదాగా వెళ్ళిరండి..." సలహా ఇచ్చింది జ్యోతి! సాయంత్రం నాలుగ్గంటలవేళప్పుడు కృష్ణ వద్దకి వెళ్లాను.

"రామూ... ఐ లవ్...యూ..." ఫక్కున నవ్విన శబ్దం!

అది నా భ్రమ అని నాకు తెలుసు! గీత మళ్లీ వస్తే... నేనూ ఐ లవ్ యూ అని అంటాను. హృదయపూర్వకంగా అక్కున చేర్చుకుంటా! ఓదార్పుగా ముద్దాడుతాను!

కానీ... ఆ గీత చెదిరిపోయింది. ఆ గీత కాలగర్భంలో కలిసిపోయింది.

ఒక్కసారి నా గతం నన్ను వెంటాడింది!

◇ ◆ ◇

నేను బి.ఎ ఫైనలియర్ చదువుతుండగా మా నాన్నకి అమరావతిలో బ్యాంకు మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చి, ట్రాన్స్‌ఫర్ అయింది!

అమరావతి పుణ్యక్షేత్రం! కృష్ణానది సౌందర్యం! ఊహించుకుంటేనే ఒళ్లు పులకరించింది!

ఉత్సాహంతో అమ్మ, నాన్న, నేను ఆ ఊరు చేరాం, వారం రోజుల తరువాత అన్ని సర్దుకున్నాక అమ్మ అమరేశ్వర ఆలయానికి వెళదాం అంది! నేను ఉత్సాహంగా బయలుదేరాను అమ్మతో! కొబ్బరికాయలు అమ్మే కొట్టు దగ్గర నిలబడి కొబ్బరికాయ తీసుకున్నాను. చిల్లర లేక యాభై రూపాయల కాగితం ఇచ్చాను. చిల్లర లేదంది కొట్టు అమ్మాయి.

"నా దగ్గర వుంది... ఇలా ఇవ్వండి" చదువుగా నా వెనుకనుండి మాటలు వినబడేసరికి నేను అమ్మ ఒక్కసారి వెనక్కి తిరిగాం. తెల్ల ఓణీ, నీలంరంగు పూలు వున్న లంగా జాకెట్‌లో అందంగా వుందనే చెప్పాలి. ఆ నీలికళ్ల కవ్వింపుగా చూశాయి నా కళ్లల్లోకి! తల తిప్పుకుని యాభై రూపాయల నోటు అమ్మకి ఇచ్చాను ఆమెకి ఇవ్వమని!

"ఈ ఊరుకి కొత్తగా వచ్చారుకదూ!" చిల్లర ఇస్తూ అంది!

"అవునమ్మా..." అమ్మ సమాధానం చెప్పింది.

"అంటే... మేం వుండేది... మీ ఎదురిల్లే..."

"అవునా... నేను గమనించలేదమ్మా..."

◇ ◆ ◇

మా డాబామీద మంచుంటే ఎదురుగ్గా వున్న ఇంటివాళ్ల బావి, పెరటిస్థలం కనిపిస్తుంది. సాయంత్రం నేను అలా ఊహల్లో తేలిపోతూ కృష్ణశాస్త్రిగారి "ప్రతిరాత్రి వసంతరాత్రి..." అన్న పాట పాడుకుంటున్నాను! హఠాత్తుగా నాచూపు ఎదురింట్లో అరటిచెట్టుదగ్గర నిలబడి కన్ను ఆర్పకుండా నన్నే చూస్తున్న ఆమెపై పడ్డది! ఎంతసేపటి

నుండీ అలా చూస్తోందో! టక్కున పాట ఆపేశాను! వంచిన లుంగీ తప్పించి బనీను వేసుకోలేను! సిగ్గేసింది. దండానికి వున్న టవల్ చటుక్కున లాక్కుని భుజం చుట్టూ కప్పుకున్నాను! నేను చూపు మరల్చే లోపల ఆమె పలకరింపుగా నవ్వింది! ఆ నవ్వుకి నాకు చిరాకేసింది! సభ్యత కాదని నేను నవ్వేసి కిందికి వచ్చేశాను.

వారం రోజులుగా గమనిస్తూనే వున్నాను! ఆ అమ్మాయి నేను ఎక్కడ కనిపిస్తే అక్కడ చూపు నిలిపి పలకరింపుగా నవ్వడం! అలా ఒక ఆడది, పరాయి మగాడిని చూడడం, అవసరం లేకపోయినా పలకరింపుగా నవ్వడం నాకెందుకో సంస్కారంగా అనిపించలేదు! వెంటాడే ఆమె చూపులు నాలో అసహ్యాన్ని పెంచాయి! ఆమె కనిపించకుండా వుంటే బాగున్ను అనిపించింది! నా పనికి, నా చదువుకు ఆమె చూపు ఆటంకంగానే వుంది!

◇ ◆ ◇

పది రోజుల తరువాత దొడ్లో అమ్మతో పిండిరుబ్బుతూ గలగలా కబుర్లు చెబుతోంది ఆమె! నేను కాలేజీనుండి అప్పుడే వచ్చి కాళ్లు కడుక్కుందామని దొడ్లోకి వెళ్లాను.


"ఒరేయ్... గీతతో నాకు మంచి కాలక్షేపంరా! ఎంత పనిమంతురాలనీ, ఎంత మాటకారీ..."

అమ్మ అలా తనగురించి చెప్తుంటే చిలిపి నవ్వుతో నావైపు చూసింది. ఆమె చూపులనుండి తప్పించుకుని నా గదిలోకి వెళ్లిపోయాను! పావుగంట తరువాత గీత ప్లేట్‌లో వేడివేడి గారెలు పెట్టుకుని ఎదురొచ్చింది బయటికి వెళ్లబోతుంటే!

"తీసుకోండి..."

"ఒరేయ్... రామూ! ఇంకో రెండు వేయమంటావా? వంటగదిలోంచి అమ్మ అరుపు!"

"ఇంకో రెండు తీసుకుని రమ్మంటావా



?'' సొంత మనిషిలా చనువుగా అడిగింది.

''వద్దమ్మా...'' అమ్మకే వినబడేటట్టు చెప్పాను. ఏం అనుకుందో వెంటనే అక్కడి నుండి వెళ్లిపోయింది. ఆ రోజునుండి ప్రతిరోజూ మా ఇంటికి రావడం, అమ్మతో చనువుగా కబుర్లు చెప్పడం! మధ్యమధ్య నన్ను తన చూపులతో తినేసేటట్లు చూడ దం జరిగిపోతూనే వుంది! ఆ చూపుల్లో ఎంత వెతికినా నాకు ప్రేమ కనబడలేదు. ఆమె పట్ల నాకు ప్రేమ కలగకపోవడమే దానికి కారణం కావచ్చు! మొదట్లోనే నాకు గీతపట్ల సదభిప్రాయం లేదు! కారణం చెప్పలేనుకానీ, ఆమె చేష్టలు నాకు నచ్చడం లేదు! ఆమె నన్ను ప్రేమించుతోందా? కామించుతోందా? నన్ను ఆట పట్టించుతో ందా? అర్థం కావడంలేదు! ఒకరోజు నా గదిలోకి వెళ్లేసరికి నా గదిలో మంచంమీద కూర్చుని నా ఫోటోని తన గుండెలకు హత్తుకుని, పెదవులకి ఆనించుకుంది. తనే వచ్చి నా గుండెలకి తాకి, నన్ను ముద్దుపెట్టు కున్నట్టు అయింది! ఆ ఆలోచనే అసహ్యంగా తోచింది!

''ఏం పని ఇది...'' మెల్లిగా అన్నాను! ఎక్కడ అమ్మ వింటుందోనని.

''తెలుగులో ... చెప్పనా? ఇంగ్లీషులో స్టయిల్‌గా వుంటుంది.... ఇంగ్లీష్‌లోనే చెప్తాను! ఐ ... లవ్... యూ!'' అంది నాకు చాలా దగ్గరగా వచ్చి.

''ఛీ...'' మొహం తిప్పుకున్నాను!

''నిజంగా... మీరంటే నాకిష్టం రామూ!'' మీ కళ్లంటే నాకు మరింత ఇష్టం... నన్నవి మీ పెదవుల ఆ చిరునవ్వు అంటా జీవితాంతం చూస్తూ వుండాలనీ, మీతో మనసు విప్పుకుని మాట్లాడుకోవాలని... నేను ఎంతగా కోరుకుంటున్నానో చెప్పలేను. నిజంగా మీరంటే నాకు....'' సరిగ్గా అప్పుడే అమ్మవచ్చింది! ఆమె ఒక్కసారి ఆపేసింది. నా బుర్ర తిరిగి పోయింది! ప్రేమ అనేది ఇద్దరి హృదయాల వారధి! జీవిత రథసారథి! నువ్వంటే నాకిష్టం అన్నంత మాత్రాన ప్రేమ పుట్టుకొస్తుందా... ఎదుటి మనిషి హృదయంలోంచి! అది హృదయస్పందన! మధుర భావన! అంతేకానీ ఆకలిచూపులు కావు. ఆశపడడంకాదు!'' గట్టిగా చెప్పుదామ నుకున్నాకానీ ఆ మాటలు నా గుండె గొంతుకలోనే వుండిపోయాయి! కారణం ఆ సమయానికి అమ్మ రావడం!

చెప్పాలి! రేపైనా! పిచ్చి పిచ్చి ఆలోచన లు పెట్టుకోవద్దని, గట్టిగా చెప్పాలి! కానీ చాలా రోజులదాకా నాకు అవకాశం రాలేదు!

ఆమెకి మా ఇంట్లో చనువు ఎక్కువైంది! ఊళ్లోవాళ్లుకూడా ఆమెని నన్ను వింతగా చూడడం గమనిస్తూనే వున్నాను! ఒకరోజు అమ్మ అన్నం వడ్డిస్తూ ''ఒరేయ్ ఇవాళ పక్కింటి మీనాక్షమ్మగారు అడిగిందిరా! ఏమిటీ... గీత ఎప్పుడూ మీ ఇంట్లోనే వుంటుంది! కోడల్లా తిరుగుతోంది... ''నా కు అనిపించిందిరా! అమ్మాయి మంచిపిల్లే!...'' అమ్మ మాటలకి అడ్డు చెప్పలేక మౌనంగా భోజనం ముగించి లేచాను. ఆ రాత్రి నాన్నగారితోకూడా అదే విషయం చెపుతోంది అమ్మ! నాన్న వింటూ ఊఁకొడు తున్నారు! ఏదోలాగింది నాకు'

◇ ◆ ◇

ఏం తోచక కృష్ణ ఒడ్డుకి వెళ్లి కూచున్నాను! నా వెనకే ఎప్పుడొచ్చిందో గీత నాలుగడుగుల దూరంలో తను కూర్చుంది! నలుగురూ మమ్మల్నే గమనిస్తున్నారేమో అనిపించింది!

నేను సీరియస్‌గా "చూడు ఇది మహానగరం కాదు! మనిద్దరినీ నలుగురూ చూస్తే బాగోదు... అసలే నువ్వు ఇంటికొస్తుంటే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు.... అది నీ జీవితానికే దెబ్బ... ఆడపిల్లవి... హద్దుల్లో వుంటే మంచిది!"

"అందుకే చెప్తున్నా... రామూ... నిజంగా నువ్వంటే నాకు చాలా ఇష్టం... నా జీవితంలో భర్తగా ఇంకో వ్యక్తిని ఊహించుకోలేను..."

"సినిమాలు బాగా చూస్తావనుకుంటా!' హేళనగా అన్నాను.

ఆమె కళ్లల్లో నీళ్లు తిరగడం నేను గమనించకపోలేదు! చాలాసార్లు ఆమె అలా కన్నీరు పెట్టుకోవడం నేను కనిపెట్టాను! బహుశ ఇదో రకమైన అస్త్రం అయ్యుంటుంది! అనుకున్నాను.

నిజం రామూ... నీకెలా చెపితే అర్థం అవుతుంది"

"ఓహో... అంత ప్రేమ వుందన్నమాట నామీద! అయితే ఈనాటి రాత్రి నాతో గడుపుతావా!" నా మాటలు నాకే సిగ్గనిపించినా అన్నాను! కావాలనే అన్నాను.

చివ్వున తల ఎత్తి చూసింది. ఆ కళ్లలోని భాష నాకు అర్థంకాలేదు!

"రామూ! రమ్మంటే నరకానికైనా ఆనందంగా వస్తాను... నువ్వు నాతో ప్రేమగా మాట్లాడితే చాలు..."


"ఇది ప్రేమ అనను. ఒక బజారు మనిషికీ... నీకు తేడా లేదంటాను నేను!" సీరియస్‌గా అనేసి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేశాను!

## పేపర్ లాభం

"ఒరేయ్ గిరీశం... రోజూ మనం చదివే దినపత్రికలవల్ల ఏయే లాభాలున్నాయో కాస్త చెప్పరా?"

"ఆ పేపర్లలో పొట్లాలు కట్టుకోవచ్చు సార్... అంతేకాదు పేపర్లతో పడవలు తయారుచేసుకుని ఆడుకోవచ్చుకూడా సార్!"

— ప్రియాసరస్వతి



ఆ తరువాత పదిహేను రోజులదాకా నాకు కంటపడలేదు గీత!

ఒకరోజు...

"ఒరేయ్... ఇవాళ మాణిక్యమ్మగారు ఎంతో బాధపడింది! గీతకి సంబంధాలు రావడంలేదుట... ఆ అమ్మాయి మనింటికి వస్తూ పోతుంటే చుట్టుపక్కలవాళ్ళు అనవసరమైన నిందలు వేస్తున్నారు. అది లోకసహజం అనుకో! నేను ఇవాళ చెప్పాను గీతతో. ఇంటికి రావడం తగ్గించమని! పాపం గీత వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయింది! పిచ్చిపిల్ల... అమాయకురాలు! నువ్వంటే ఆ పిల్లకి ఇష్టం అని తనతోనే చెప్పింది..

అమ్మ మాటలకి అడ్డువచ్చి "అమ్మా! నాకు ఇంటర్వ్యూ కార్డు రావాలి... వచ్చిందా! నాన్నగారు చెప్పారు. ఈ వారంలో వస్తుందని."

అనుకున్నట్టుగానే నేను బ్యాంక్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవడం... అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ రావడం జరిగిపోయాయి! బందరు దగ్గర గుడ్లవల్లేరు బ్రాంచికి వేశారు నన్ను! రెండు రోజుల్లో బయలుదేరాలి! నాన్నగారు అమ్మ హడావిడిపడిపోతున్నారు! నాకు ఆనందంగా వుంది.

బుక్స్ ప్యాక్ చేస్తుండగా తలుపు దగ్గర అలికిడి అవుతే తల ఎత్తి చూశాను!

గీత...!

చాలారోజులైనట్లుగా వుంది! బాగా చిక్కి పోయి కళ్ళు గుంటలుపడి రోగిష్టి మనిషల్లే వుంది! పలకరింపుగా నవ్వాను! ఒకవిధంగా పాపం అనకూడని మాట అని ఆ అమ్మాయిని బాధపెట్టానేమో?

కానీ నాతో గర్వం చూపలేదు!

వెళ్ళిపోతున్నాననే ఉత్సాహంతో నవ్వాను!

నేనే గెలిచాను అన్న హుందాగా నవ్వాను!

గబుక్కున కాళ్ళమీద పడింది! అనుకోని ఈ చర్యకి ఆశ్చర్యం వేసింది. వెక్కి వెక్కి ఏడిచింది!

"రాముా... నువ్వు చేసుకోకపోతే నాకు ఈ జన్మకి పెళ్లి అవదు! అమ్మ బెంగతో మంచం పడుతుంది! చుట్టుగుడూ మనిద్దరికీ ఏదో సంబంధం వుందనుకుంటున్నారు! ఆ నిందనుండి నన్ను తాళికట్టి విముక్తురాలిని చెయ్యి! దయచేసి కాదనకు!"

"దానికి నేనా కారణం. నేను నీతో ఎప్పుడైనా చనువుగా ప్రవర్తించానా? ప్రేమిస్తానని చెప్పానా? ప్రేమ హృదయంలోంచి రావాలికానీ ప్రేమించమని అధికారంగా చెపితే ప్రేమ పుట్టుకొచ్చేయదు."

"రాముా... నన్ను నిష్కారణంగా తిరస్కరిస్తున్నావు. రేపు నువ్వు నన్ను ఎక్కేలో పల నీమండీ సమాధానంరావాలి! లేకపోతే ఈ గీత కృష్ణలో తేలుతుంది..." ఉబికి వస్తున్న కన్నీటితో అంది!

"ఏం బెదిరిస్తున్నావా? నువ్వంటే నాకిష్టం లేదు. వెళ్లవతలకి..." అన్నాను కోపంగా!

నాన్నగారు బిత్తరపోయారు! అమ్మ అంతకంటే ఆశ్చర్యపోయింది. నేనేం మాట్లాడలేదు! గీత చివ్వున లేచి వెళ్ళిపోయింది! రాత్రి తెల్లవార్లు నిద్రలేదు! ఏదో తెలియని ఉలిక్కిపాటు! నా మనస్సు ఎందుకో కీడు శంకిస్తోంది!

భళ్లున తెల్లారింది! నేను హడావిడిగా

అన్నీ సర్దుకున్నాను. అమ్మ ఆరోగ్య విషయాలగూర్చి పెద్ద లిస్ట్ చదివింది! నాన్నగారు ఆఫీస్‌లో ఎలా బిహేవ్ చేయాలో హితబోధ చేశారు! నాన్నకి, అమ్మకి కాళ్లకి దణ్ణం పెట్టి వాకిట్లోకి వచ్చాను! అంతా హడావిడిగా పరుగెత్తుతున్నారు! గొల్లున ఏడుపు వినిపించింది. ఆ గొంతు మాణిక్యమ్మగారిదే! ఏం జరిగిందీ? కొంపదీసి...

"ఏం అయింది." అంటూ అమ్మ బయటికి వచ్చింది.

"పంపులు రావడంలేదని... గీత పొద్దున్నే బిందె తీసుకుని కృష్ణకు వెళ్లింది. కాలుజారి పడి కొట్టుకుపోయిందిట. శవాన్ని వెతుకుతున్నారు గజఈతగాళ్లు... పాపం మాణిక్యమ్మగారికి ఈ వయసులో చాలా పెద్ద కష్టం వచ్చింది" ఎవరో చెపుతుంటే.. నా చెవులకి ఏం వినబడడంలేదు!

నాన్నగారు సూటిగా చూసిన చూపులు నా గుండెలకి గుచ్చుకున్నాయి! పరోక్షంగా ఆ అమ్మాయి చావుకి నేనే కారణం! ఆమె కాలుజారి పడలేదు! కావాలనే ఆత్మహత్య చేసుకుంది! అది నాకు తెలుసు... అమ్మకి తెలుసు... నాన్నకి తెలుసు. తన ప్రేమని తిరస్కరించానని ఈ విధంగా ప్రవర్తించింది! తన జీవితాన్ని అంతం చేసుకుంది! ఆమెని ఎంతగా గాయపరిచానో! ఒక్కొక్కటీ నా కళ్లముందు మెదిలాయి! చివరికి ఆమెని బజారు మనిషి అన్నాను! నా ఇంటికి రావడంవల్లే ఆమె నిందలకి, నా తిరస్కారానికి గురి అయింది! "ఆమె ప్రేమని అర్థం చేసుకోలేని పిచ్చివాడివి నువ్వు" అని నాన్న నన్ను ఓదార్చుతుంటే కుళ్లి కుళ్లి ఏడ్చాను!

ఆమె కన్నీరు గుర్తుకొచ్చినప్పుడల్లా తప్పుగా ఆమె యెడల ప్రవర్తించాననిపించింది!

"రామూ.... గుండె రాయిచేసుకుని బయలుదేరు..." భుజం తట్టారు!

నేను రిక్షాలో బస్‌స్టాప్‌వైపు బయలుదేరుతుంటే గీత శవం నాకెదురొచ్చింది! నన్ను క్షమించమని అడగలేదు. శపించమని అడిగాను! నాకు శిక్ష వేయమని వేడుకున్నాను.

ఈరోజుదాకా నేనెటువంటి శిక్షా అనుభవించలేదు! ఎందుకంటే గీత నన్ను ప్రేమించిందికానీ ద్వేషించలేదు. నన్ను కోరుకుంది కానీ శపించలేదు. నాతో జీవించాలనుకుంది కానీ.. నా నాశనాన్ని తాను కోరుకోలేదు. ప్రేమ త్యాగాన్నే కోరుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఆమెకోసం పరితపించాను. మానసికంగా కృంగిపోతున్నాను! ఆమె జ్ఞాపకాలు, ఆమె నవ్వు... ఆమె చూపులు... నన్ను నీడలా వేటాడుతూనే వున్నాయి! మరో జన్మ అంటూ వుంటే గీతపై రెట్టింపు ప్రేమతో జీవించాలని ఆ అమరేశ్వరుని వేడుకుంటున్నాను! అంతకన్నా ఏం చేయగలను! పొద్దు కుంగుతున్నా నా ఆలోచనలకి చీకటి తప్పితే వెలుతురు లేదు. మరో జన్మకోసం ఎదురు చూడడం తప్ప నేనేం చేయగలను! నన్ను క్షమించమని అడగడాని నోచుకోని శిక్ష... ఈ బాధ... ఈ వ్యథ..."

* * *